# రంభ - ఊర్వశి - మేనక

అది అటు పల్లె, ఇటు పట్నమూ కాని ఒక ఊరు. అక్కడ బస్సులున్నాయి కాని హైటెక్ బస్సులు లేవు. హోటల్సు ఉన్నాయి కాని, ఫైవ్ స్టార్ హోటలు లేదు. సినిమా హాలు వుంది. కాని ఏ.సి.కాదు. కాలేజీ వుంది కాని కోచింగ్ సెంటర్లు లేవు.

అలాంటి ఊళ్లోని ఆ ఎడ్యుకేషనల్ కాలేజీలో మాథ్సలెక్చరరు అనంత్. హాండ్సమ్‌గా ఉన్న ఆ బాచలర్ లెక్చరర్ని చూస్తే, ఆ కాలేజీలో టీచింగ్ స్టాఫ్‌లోని పెళ్ళికాని ఉమెన్ లెక్చరర్లకే కాదు. కాలేజీ అమ్మాయిలకు కూడా అంత క్రేజ్. అతని ఉపన్యాసం అద్భుతంగా వుంటుంది. మెస్మరైజ్ చేయబడ్డట్లు విద్యార్థినీ విద్యార్థులు అతని లెక్చర్‌ని అంత శ్రద్ధగా వింటారు.

అతను ట్యూషన్లు చెప్పడు. అది అతని పాలసీ. క్లాసులోని స్టూడెంట్సుకు చెప్పవలసినదంతా చెబుతాడు. అతని పాఠాలు అర్థం కాని వారు లేరు. అర్థం కాక అడిగి చెప్పించుకునే వాళ్ళంటే అతనికింకా ఇష్టం.

అలాంటి అనంత్ విచిత్రమైన పరిస్థితుల్లో ముగ్గురుకి తప్పనిసరిగా ట్యూషన్లు చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ ముగ్గురూ రమ, ఉమ, మేరి. రమ తండ్రి ఒక కాంట్రాక్టరు. ఉమ తండ్రి ఒక బిజినెస్ మాగ్నెట్. మేరీ తండ్రి ఒక అధికారి.

ఆ రోజు ఉదయం అనంత్ కాలేజీకి వెళ్ళడానికి తయారై పాంటు, షర్టు, టక్‌చేసి, బూట్లు వేసుకుని, లేసులు కట్టుకుంటుండగా క్రింద ఇంటి ఓనరు రమ తండ్రి నుంచి పిలుపు వచ్చింది. టై కట్టుకుని, చేతిలో చిన్న హ్యాండ్ బాగ్‌తో కిందకు దిగాడు.

అనంత్ వెళ్లే సరికి హాల్లో సోఫాలో కూర్చుని వున్నాడు రమ తండ్రి. ప్రక్కనే కాలేజ్ బుక్స్‌తో నిలబడి వుంది రమ.

"రావయ్యా! నీకోసవే చూస్తున్నా. నిన్ను చూస్తుంటే నాకు కాలేజీ లెక్చరరువనిపించడంలా, సీనియర్ స్టూడెంట్ వనిపిస్తున్నావు"అంటూ నవ్వాడు రమ తండ్రి.

సిగ్గుతో తల వంచుకున్నాడు అనంత్.

"నిలబడతావేం. అలా సోఫాలో కూర్చో" అంటూ ఎదురుగా సోఫా చూపించాడు రమ తండ్రి.

ఒక ప్రక్కగా ఒద్దికగా కూర్చున్నాడు అనంత్. రమ, తండ్రి ముందున్న టీపాయ్ మీద కాలేజీ బుక్స్ పెట్టి లోపలికి వెళ్ళి కాఫీ తెచ్చింది.

మొహమాటపడుతున్న అనంత్‌తో "తీసుకోవయ్యా" అంటూ మృదువుగా హెచ్చరించాడు రమ తండ్రి.

అనంత్ కాఫీ చప్పరిస్తుండగా "నువ్వు ఈ కాలేజీలో లెక్చరర్‌గా చేరిన నెలరోజుల్లో మా అమ్మాయి దగ్గర పదేళ్ళ అభిమానం సంపాదించుకున్నావయ్యా. నీ దగ్గర ట్యూషన్ చెప్పించుకోవాలని ఉబటాలపడుతుందయ్యా. ఇప్పుడు ఫస్టియర్ డిగ్రీ. ఫైనలియరు కొచ్చేసరికి యూనివర్శిటీ ఫస్టు రావాలనేది అమ్మాయి ఆశ" అన్నాడు.

"నేను ట్యూషన్ చెప్పనండీ. అది నానిర్ణయం. ఈ విషయం కాలేజీలో కూడా అందరికీ చెప్పాను".

"కాలేజీ విషయం తీసెయ్యవయ్యా. నేను మాత్రం అందరికీ చెప్పమంటున్నానా. రమకి మాత్రమే చెప్పు. నేను నిన్ను గది అద్దె కూడా అడగను. అసలు నేను నీకు గదిని ఏ పరిస్థితుల్లో ఇచ్చానో ఒక్కసారి గుర్తు చేసుకో" అన్నాడు రమ తండ్రి.

అనంత్‌కు అంతా గుర్తొచ్చింది. బ్రహ్మచారికి గది అద్దెకివ్వలేదు ఆ ఊళ్ళో ఎవ్వరూ. ఎన్నాళ్ళని హోటలు గదిలో వుంటాడు. తన ఇబ్బంది క్లాసులో చెబితే ఎవ్వరూ కిక్కురుమనలేదు. కానీ మూడవరోజే తనకు తనింట్లో మేడమీద గది అరేంజ్‌చేసానని, ఎప్పుడైనా వచ్చి చేరమని చెప్పింది రమ.

ఆరోజు సాయంత్రమే తను హోటలు గది ఖాళీచేసి, రమ ఇంటి మేడమీద గదిలో చేరాడు. తరువాత తనకు ఆ గది ఏ పరిస్థితుల్లో ఇచ్చారో రమ చెప్పింది. రమ తనకు గది ఇవ్వమని తన తల్లిదండ్రులను కోరిందట. బ్రహ్మచారికి గది ఇవ్వమని తల్లిదండ్రులు ఖరాఖండీగా చెప్పారట. దాంతో ఒకరోజంతా భోజనం చేయకుండా అలిగిందట. ఎవరెన్ని చెప్పినా వినలేదట. చివరకు తన లెక్చరర్‌కు గది ఇస్తామన్న తరువాతనే భోంచేసిందట. తనకు గది విషయంలో అంతటి త్యాగం చేసింది రమ.

తనవైపే సూటిగా చూస్తున్న రమను, 'విషయం చెప్పవయ్యా' అన్నట్లు బొర్రమీసాల మాటు చిరునవ్వును దాచుకున్న రమ తండ్రిని చూసి ఇక తన నిర్ణయం మార్చుకోక తప్పలేదు అనంత్‌కు. మరుసటి రోజు నుంచి ఆమెకు ఉదయం ఏడు గంటల నుంచి ఒక గంట ట్యూషను చెప్పడానికి ఒప్పుకున్నాడు.

వారం రోజుల్లో ఆమెప్రతిభను చూసిన ఆమె స్నేహితురాళ్ళు, బెంచి మేట్లు ఉమ, మేరి దానికి కారణం తెలుసుకున్నారు. తాము కూడా అనంత్ దగ్గర ట్యూషన్ చెప్పించుకోదలచుకున్నారు. ఉమ తండ్రి ఒక పెద్ద బిజినెస్ మాగ్నెట్. మనిషి ద్వారా అనంత్‌ని ఇంటికి పిలిపించాడు. విషయం ఊహించిన అనంత్ వెళ్ళలేదు. ఇంట్లో ఉమ ఒత్తిడి ఎక్కువయింది. ఇక తట్టుకోలేక ఆమె పుట్టిన రోజని ఆ సాయంత్రం పెద్ద డిన్నర్ ఏర్పాటు చేశాడు ఉమ తండ్రి. ఉమ తన స్నేహితురాండ్రు రమని, మేరిని, లెక్చరర్ అనంత్‌ని కూడా ఆహ్వానించింది. వెళ్ళదలుచుకోలేదు అనంత్.

రమ తండ్రి "వెళ్ళకుంటే బాగుండదయ్యా. అతను నా స్నేహితుడు" అంటూ బలవంతంగా తన కారులో రమతో బాటు అనంత్‌ను కూడా ఎక్కించుకుని వెళ్ళాడు.

అక్కడకు వెళ్ళిన తరువాత అనంత్ తెలుసుకున్న దేమిటంటే రమ తండ్రి, ఉమ తండ్రి దగ్గర కాంట్రాక్టు పనులకు డబ్బు అప్పు తెస్తుంటాడని, ఉమకు ట్యూషన్ ఇప్పించే బాధ్యత రమ తండ్రికి అప్పగించాడని, ఉమ వేడికోలుకయితేనేమి, ఉమ తండ్రి, రమ తండ్రిల రిక్వెస్టుల కయితేనేమి అనంత్ ఉమకు ట్యూషన్ చెప్పడానికి ఒప్పుకున్నాడు. ఆ గ్రాండ్ డిన్నర్ అయిన తరువాత ఎవరిళ్లకు వాళ్ళు వచ్చేసారు.

ఇది జరిగిన వారం రోజులకు ఓ ఉదయం కొత్త స్కూటరులో వచ్చింది మేరి. ఆ సమయంలో అనంత్ రమకు ట్యూషన్ చెబుతున్నాడు.

"గుడ్ మార్నింగ్ సార్. మీరు స్కూటరు లోనుకు అప్లికేషను పెట్టారా" అంటూ గదిలోకి వచ్చింది మేరీ.

ఆమె హఠత్ ఆగమనానికి ఆశ్చర్యపోతూ, "అవును నీకెలా తెలుసు?" అన్నాడు.

"బ్యాంక్ మేనేజరు మా నాన్నగారేలే."

"ఆయన ఇవ్వనన్నాడుగా."

"ఆయన అనడమేమిటి? మీ లోను నిన్ననే శాంక్షను చేయించాను. చెక్ తీసుకెళ్ళి కంపెనీలో ఇచ్చేసి మీ తరపున స్కూటరు కూడా తీసుకొచ్చాను. ఇవిగోండి కీస్" అంటూ స్కూటర్‌కీస్ అలవోకగా అనంత్ వైపు విసిరింది.

"సర్‌ప్రయిజ్" అంటూ వాటిని నాజూకుగా అందుకున్నాడు అనంత్.

అతని చిరకాల వాంఛ నెరవేరింది. ఇక స్కూటరు మీద కిలోమీటరు దూరంలో వున్న కాలేజీకి బట్ట నలక్కుండా వెళ్ళవచ్చు.

"థాంక్స్ మేరీ. నువ్వింత సాయం చేస్తావని అనుకోలేదు."

"ఇంత సాయం చేసినందుకు నాకు థాంక్స్ వద్దు. నాకు ఒక సహాయం చేయండి."

"చెప్పు ఏదైనా చేస్తాను".

"ప్రామిస్."

"ప్రామిస్."

"అయితే రేపట్నుంచి. నాకు కూడా మా ఇంటికి వచ్చి ట్యూషన్ చెప్పండి."

"నేను చెప్పనని చెప్పాను కదా."

"ప్లీజ్. ఇంత కష్టపడి మా నాన్నను బ్రతిమాలి మీకు లోన్ ఇప్పించింది ఇందుకా సార్" ఏడుపు ముఖం పెట్టి అంది మేరీ.

రమ కూడా కలుగజేసుకుని "సార్ మేం ముగ్గురం క్లాసుమేట్సు, బెంచిమేట్లమే కాదు. క్లోజ్ ఫ్రెండ్స్‌మి కూడా. మేమిద్దరం ట్యూషన్ చెప్పించుకొంటూంటే అదొక్కటి బిక్కుబిక్కు మంటూ వుండడం మాకు బాధగా వుంది సార్" అంటూ బ్రతిమాలింది.

"ఇలా చెప్పుకుంటూ పోతే చివరకు ఓ పాతికమంది తయారవుతారు."

"ఇక ఎవరికీ చెప్పవద్దు సార్. మా ముగ్గురికే చెప్పండి చాలు" అంటూ బ్రతి మాలడం మొదలు పెట్టారు ఇద్దరూ.

ఆమె తనకు లోను సాయం చేయడం వల్లనైతనే నేమి, ముగ్గరూ బెంచిమేట్లు అవడం వల్లనయితేనేమి, చివరకు ఆమెకు కూడా ట్యూషను చెప్పడానికి ఒప్పుకున్నాడు అనంత్.

రోజులు గడుస్తున్నాయి. నెలనెలా ట్యూషను చెప్పించుకుంటూ మంచి మొత్తం ముట్టజెపుతున్నారు ముగ్గురూ.

ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు రమకు ట్యూషను. ఉదయం తొమ్మిది గంటలకు వెలితే మధ్యాహ్నం ఒంటి గంటకు కాలేజ్ నుంచి వస్తాడు. ఒక పూటే కాలేజీ. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు వరకు ఉమకి ట్యూషను. అయిదు నుంచి ఆరు వరకు మేరీకి ట్యూషను. ఇదీ అనంత్ దినచర్య. వాళ్ల అందంవల్ల నయితేనేమి, వాళ్ళ చనువువల్ల నయితేనేమి, ఆ ముగ్గరు అమ్మాయిల పట్ల ఆకర్షితుడయ్యాడు కుర్రవాడైన అనంత్.

రమ తెల్లగా, అందంగా, బొద్దుగా వుంటుంది. గుండ్రని ముఖం. విశాలమైన కళ్ళు, అందమైన ముక్కు, ఎర్రని దొండపండులాంటి పెదవులు, ఎంతసేపు చూసినా తనివితీరని ముఖబింబం ఆమెది. అందంగా అలంకరించుకోవడం ఆమెలోని ప్రత్యేకత. ఆమె కళ్ళలోకి చూసినప్పుడల్లా ఏదోమైకం కమ్మేది అనంత్‌కి. తనను తాను నిగ్రహించుకొంటూ పాఠం చెప్పేవాడు. ఏక సంథాగ్రాహి రమ.

ఉమది స్ట్రక్చరల్ పర్సనాలిటీ. సన్నగా పొడవుగా, పుసుపుకొమ్ము రంగులో వుంటుంది. పెద్ద పెద్ద కళ్ళు, ఆకర్షణీయమైన ముఖవర్చస్సు. ఆమె ఒక సంగీత కళాకారుని వద్ద భరతనాట్యం నేర్చుకుంటూ వుంది. అందుకే ఆమె నడుస్తూంటే నాట్యం చేసినట్లు వుంటుంది. ఆమె నడిచిపోయేటప్పుడు వెనుకనుంచి చూస్తే మతిపోయేది అనంత్‌కి. ఆ లయబద్ధమైన నడక, జడ ఊపులు అతన్ని మరోలోకంలోకి తీసుకుపోయేవి. ఆమె పాఠం వింటూనే 'అపనుంది సార్, ఈ పనుందిసార్' అంటూ గదిలోంచి అటూఇటూ వెల్తుండేది. ఆమె నడక చూస్తేనే తను ధన్యమైపోయినట్లు భావించే అనంత్ ఆమెను కాదనేవాడు కాదు. ఆమె వెల్తూంటే ఇష్టంగా చూసేవాడు. ఇంత చేసినా ఆమె తన స్నేహితురాళ్ళతో సమానంగా మార్కులు తెచ్చుకునేది.

ఇకపోతే మిగిలింది మేరీ. మనిషి చామనచాయగా వుంటుంది. శరీరంలోని అందాలన్నీ భారీగానే వుంటాయి. రంగు లేకపోయినా ఆకర్షణీయంగా వుంటుంది. ఎప్పుడు శుచిగా, శుభ్రంగా వుంటుంది. ఆమె ఇంటికి వెళ్లేది సాయంత్రం పూట. అప్పటికే ఆమె స్నానం చేసి, ఒళ్లంతా స్ప్రే చేసుకుని నైట్‌గౌన్‌లో దర్శనమిచ్చేది. మేరీలో ప్రత్యేక ఆకర్షణ ఆమె టోన్. ఆమె గొంతు విప్పితే కోయిల కూసినట్లుంటుంది. కళ్ళు మూసుకుని ఆమె మధురమైన గొంతు వింటూ నిద్రాహారాలు మానివేసి ఏళ్ల తరబడి జీవించవచ్చు అనుకుంటాడు అనంత్. అంత మధురమైన గొంతు ఆమెది.

వీళ్ళ అందాలకు మురిసిపోయిన అనంత్ వాళ్ళకి రంభ, ఊర్వశి, మేనక అని ముద్దు పేర్లు పెట్టుకుని ఊహల్లో తేలిపోతూ కలలు కనసాగాడు. ముగ్గురూ అతన్ని మూడు విధాలుగా వేడెక్కించసాగారు.

రోజులు గడుస్తున్నాయి. రమ అనంత్‌తో చాలా క్లోజ్‌గా వుండేది. ఒక ఆడ స్నేహితురాలితో వున్నంత చనువుగా అతన్ని రాసుకుంటూ, పూసుకుంటూ తిరిగేది. ఆ రోజు రమ తమ్ముడితో గొడవ పడింది. దాంతో వాడు ఆమె పుస్తకాన్ని పాత సామానుల గదిలో దాచేశాడు. అది తెలిసిన రమ పాతసామానుల గదిలో దూరి ఎలాగయితే నేం ఒక అరగంటలో దాన్ని పట్టేసింది.

తరువాత్ అనంత్ గదిలోకి వచ్చి అతన్ని అనుకుని వెనక్కి తిరిగి నిలబడింది. "మాస్టారూ, వెనుక బూజు అంటుకొని వుంటుంది. నాకు కనిపించదుగా, మీరు విదలగొట్టండి" అని కోరింది.

ఆమె అంత దగ్గరగా తన వీపు చూపి నిలబడే సరికి అనంత్ నరాలు జివ్వుమన్నాయి. ముందు తల మీద బూజు తీసాడు. నున్నని మెడమీద తడిమాడు. మెత్తని వీపు మీద బూజు తీస్తూ, సున్నితంగా నిమిరాడు. వెనుక వృష్టభాగాన్ని మృదువుగా తడుతూ బూజు దులిపాడు. అలాగే కింద వరకు తడుముతూ దుమ్ము విదలగొట్టాడు. అనంత్ తడుముతూంటే ఆమె "చక్కలిగిలి మాస్టారు, చక్కిలిగిలి" అంటూ కథాకళి నృత్యం చేసింది. అనంత్ మాత్రం బూజు నెపంతో ఆమె శరీరాన్ని పదేపదే తడిమి ఆ స్పర్శలో వున్న మధురానుభూతుల్ని స్వంతం చేసుకున్నాడు.

ఒక నెల తరువాత అనంత్ ఒక రోజు ఉమ ఇంటికి వెళ్లేసరికి ఆమె టేప్ రికార్డర్లో పాటపెట్టుకుని హాల్లో నృత్యం చేస్తూ వుంది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరు. ఎదురుగా వున్న అనంత్‌ను కూడా గమనించలేదు. నాట్యం చేస్తూ క్లైమాక్స్‌లో "కృష్ణయ్యా" అంటూ ఎదురుగా ఉన్న అనంత్ మెడచుట్టూ చేతులు వేసి కౌగిలించుకుని, కృష్ణుడ్ని కౌగిలించుకుని రాధ పారవశ్యం చెందినట్లు పారవశ్యం చెందింది ఉమ.

అనంత్ కయితే నరాలు స్వాధీనం తప్పాయి. తన మెడను చుట్టుకున్న రెండు చేతులు, తన ఎదపై ఆమె మెత్తని ఎద. తనను అణువునా చుట్టుకున్న ఆమె అందాలు ఆయాచితంగా అతని చేతులు ఆమె నడుమును చుట్టి తనవైపు అదుముకున్నాయి. అయిదు నిమిషాలకు గాని ఈలోకంలోకి రాలేదు.

చేతులు వదిలేసి, తనను విడిపించుకుని దూరంగా జరిగి తలదించుకుంది ఉమ.

"సారీ. మాస్టారు. నేను నాట్యంలో నన్ను నేనే మరిచిపోతాను. శ్రీకృష్ణుడ్ని కౌగిలించుకున్నట్లు నటిస్తూ నాట్యంలో లీనమయిపోయిన నేను కృష్ణయ్య రాధను అల్లుకొన్నట్లు మిమ్మల్ని అల్లుకొనిపోయాను. ఏమనుకోరు గదా".

"అయ్యయ్యో. అలా ఎందుకనుకుంటాను ఉమా. కాకపోతే ఈ రోజు ఏమీ తోచక అరగంట ముందుగా నీకు ట్యూషను చెప్పడానికి వచ్చాను"

"నిజంగా మీరు తిడుతారేమో ననుకొన్నాను మాష్టారూ" బుంగమూతి పెట్టి భయంగా అంది ఉమ.

'నువ్వు రోజూ ఇలా కౌగిలించుకుంటానంటే రోజూ అరగంట ముందుగానే వస్తాను' మనసులోనే అనుకొన్న అనంత్. "నీ నాట్యం మెచ్చుకోవాల్సిన విషయం. తిట్టాల్సిన విషయం కాదు" అని, "వెళ్లు రెడీ అయిరా. ట్యూషను చెబుతాను" అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఆదివారాలు ఎవ్వరికీ ట్యూషన్ చెప్పడు అనంత్. ఆ రోజు పూర్తిగా రెస్ట్. సినిమాకు వెల్తుంటాడు. అలవాటు ప్రకారం ఆ ఆదివారం సాయంత్రం కూడా సినిమాకు బయలు దేరాడు. థియేటర్ ముందు జనం గుంపుగా వున్నారు. ఈ రోజే సినిమా రిలీజ్ అయినట్లుంది. బుకింగ్ దగ్గర కొండవీటి చాంతాడంత క్యూ. ఆక్యూలో నిలబడి టిక్కెట్టు తెచ్చుకోవడమన్నది దుర్లభం. ఇక లాభంలేదని వెనుకకు తిరిగాడు అనంత్.

నాలుగు అడుగులు వేసాడో, లేదో వెనుకనుంచి "మాష్టారు" అన్న కేక వినబడింది.

ఇటు తిరిగిన అనంత్‌కు, కొద్ది దూరంలో టికెట్టు పట్టుకుని నిలబడి వున్న మేరీ, ఆమె తమ్ముడు కనిపించారు. వాళ్ళని సమీపించాడు అనంత్.

"మాష్టారూ. సినిమాకు వచ్చారా. నా దగ్గర రెండు టిక్కెట్లు వున్నాయి లెండి. మా తమ్ముడిని ఇంటికి పంపించేస్తాను" అంటూ తమ్ముడ్ని ఇంటికి వెళ్ళిపొమ్మంది.

"అరె. ఆ అబ్బాయిని ఎందుకు ఇంటికి పంపడం పాపం" నొచ్చుకున్నాడు అనంత్.

"ఫరవాలేదు మాస్టారు. వాడు ఈ రోజు కాకపోతే రేపు చూస్తాడు. మీరు వారానికి ఒక్కసారేగదా సినిమాకు వచ్చేది" అంటూ సర్ది చెప్పింది.

మేరీ తమ్ముడు ఇంటికి వెళ్ళిపోతే, మేరీ, అనంత్ ఆ టికెట్లతో సినిమా థియేటర్‌లోకి నడిచారు. ఇద్దరూ ప్రక్క ప్రక్క సీట్లలో కూర్చున్నారు. సినిమా బాగుంటుందను కున్నాడు గాని, ఇంత బోరుకొడుతుందని అనుకోలేదు. ప్రక్కనే మేరీ వుండడం వల్ల అనంత్‌కి సినిమా బోరు తెలియడం లేదు. మేరీ చేతిని తన చేతుల్లోకి తీసుకుని వాచీ సర్దుతూ, వ్రేళ్లు నిమురుతూ కాలం గడుపుతున్నాడు.

ఇంటర్వెల్ అయింది. "మాష్టారూ ఈ బోర్ సినిమా చూళ్ళేకున్నాను. వెళ్దాం పదండి" అంది మేరీ.

అనంత్‌కు కూడా అలాగే వుంది. అనంత్ స్కూటరు బయటకు తీశాడు. మేరీ సలహా ప్రకారం స్కూటర్ని పార్కువైపు దారి తీయించాడు.

ఎవరూలేని చోట పచ్చగడ్డిలో ఇద్దరూ కూర్చున్నారు. పార్కులోని దీపం కాంతి పలుచగా వీరి మీద పడుతోంది.

"మాష్టారూ. నా గొంతు చాలా స్వీట్‌గా వుంటుదని అంటుంటారు గదా. పాత సినిమా పాటలు కొన్ని పాడుతాను. వింటారా" అంది మేరీ అనంత్ కళ్ళల్లోకి చూస్తూ.

"అంతకంటేనా" ఎగిరి గంతేసాడు అనంత్. తను అడగబోయే ప్రశ్న ముందుగానే ఊహించి జవాబు చెప్పినట్లనిపించింది అతనికి.

ఆనందంగా వెల్లికిలా పచ్చగడ్డిలో పడుకొన్నాడు అనంత్. "అలాకాదు మాస్టారూ. ఇలా పడుకోండి" అంటూ అతనికి దగ్గరగా జరిగి అతని తలను తన ఒడిలో పెట్టుకుంది.

మెత్తని ఆమె ఊరువుల స్పర్శకు అతను పరవశించిపోయాడు. ఆమె తన మృదు మధురమైన కంఠ స్వరంతో పాట పాడుతూ వుంటే కళ్లుమూసుకుని ఏవేవో గంధర్వలోకాలలో విహరించాడు. ఆ రాత్రి గదికి చేరి పడుకొన్న అనంత్ ఈ అనుభూతిని జన్మ జన్మలకు పదిల పరచుకోవాలనుకున్నాడు.

రోజులు, సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. అంతా ఫైనలియరుకు వచ్చారు. ఈ మధ్య కాలంలో అనంత్‌కు ఈ రంభ, ఊర్వశి, మేనకలతో ఎన్నో అనుభూతులు, మరెన్నో మధురిమలు.

రమ,ఉమ, మేరీ ఫైనలియర్ పరీక్షలు వ్రాస్తున్నారు. ఈ పరీక్షలు అయిన తరువాత వాళ్ళతో తనకు సంబంధాలు ఉండవు. ఈ ఆలోచనలు రాగానే అనంత్ మనసు బాధగా మూలిగింది. ఇప్పుడే తేలిపోవాలి. వీళ్లలో ఎవర్ని చేసుకున్నా తన జన్మ ధన్యమయిపోతుంది. అయితే వీళ్ళలో ఎవరికి తనమీద ప్రేమ ఉందో, ఎవరు తనను చేసుకోవడానికి ఇష్టపడుతారో అన్నది అతను ఊహించలేకపోతున్నాడు.

ఆరోజుతో ఆఖరు పరీక్ష అయిపోయింది. మరుసటి రోజునుంచి వేసవి సెలవలు. అందుకే వారి మనసులు తెలుసుకోవడానికి ముగ్గురికీ మూడు ప్రేమలేఖలు వ్రాసాడు. తను ఊరికి వెళ్ళేముందు ఈ ఉత్తరాలు వాళ్ళకి ఇవ్వాలి. ఏ విషయమూ తనకు సెలవుల్లో వాళ్ళ దగ్గర నుంచి జవాబు అందాలి. అనుకున్నదే తడవుగా దాన్ని ఆచరణలో పెట్టాడు.

మొదట మేరీ ఇంటికి వెళ్ళాడు. ఆమె లేదు. దగ్గరలో వున్న ఉమ ఇంటికి వెళ్ళాడు. ఉమ ప్రశాంతంగా వాళ్ళ నానమ్మతో కబుర్లు చెబుతూ వుంది. స్కూటర్ ఆగిన శబ్దం విని లేచి నిలబడింది. లోపలికి వస్తున్న అనంత్‌ని చూసి "రండి మాస్టారూ, మీ దగ్గరికే వద్దామను కొంటున్నాను. నిన్నటితో పరీక్షల బాధ తీరిపోయింది గదా" అంది.

"ఇంతకీ పరీక్షలు ఎలా వ్రాసావు" అన్నాడు అనంత్ ఆమె కెదురుగా కూర్చుంటూ.

"చాలా బాగా వ్రాసాను. మాస్టారూ! అంతా మీ చలవే. ఇప్పుడే వస్తాను వుండండి" అంటూ లోపలికి వెళ్ళింది.

ఉమ నాయనమ్మ కూడా ఆమె వెంట లోపలికి వెళ్లింది. రెండు నిమిషాల్లో ఫ్రిజ్‌లోంచి గ్లాసుతో జ్యూస్ తెచ్చింది.

ఎదురుగా టీపాయ్ మీద పెట్టి, "మళ్లీ వస్తాను మష్టారూ" అంటూ లోపలికి వెళ్ళింది.

కొద్దిసేపట్లో చిన్న దంతపు పెట్టి తెచ్చింది. అనంత్ జ్యూస్ తాగుతుంటే ఆమాట ఈమాట చెబుతూ వుంది. అతను జ్యూస్ త్రాగడం పూర్తి కాగానే "మాష్టారూ! మీ చేయి ఇటు చాపండి" అంది.

అనంత్ తన చేయి చాపాడు. "మాష్టారూ. ఒక చిన్న గిఫ్ట్" అంటూ తన దగ్గరున్న చిన్న పెట్టి తెరిచి, మెరిసిపోయే వజ్రపుటుంగరం ఒకటి బయటికి తీసింది. అనంత్ చేతిని తన చేతిలోకి తీసుకుని వ్రేలుకు వజ్రపుటుంగరం తొడిగింది.

"ఉమా! ఏమిటిదంతా" ఆశ్చర్యంగా అన్నాడు అనంత్.

"నా సంతోషం మాష్టారూ. చూడండి ఈ వజ్రపుటుంగరం మీ వ్రేలికి ఎంత బాగా అమరిందో" అంటూ మురిసిపోయింది.

అనంత్ కాదనలేకపోయాడు. తన జేబులోని కవరు ఆమెకు అందజేశాడు.

"ఇదేమిటి మాష్టారూ"

"ఏమిటో రేపు చదువు. ఈ రాత్రికి నేను ఊరెళ్ళిపోతున్నాను" అని ఆమె వద్ద సెలవు తీసుకుని నేరుగా మేరీ ఇంటికి వెళ్లాడు.

ఇతను వెళ్లే సరికి మేరీ ఇంటి వాకిట్లోనే నిలబడి వుంది.

"సార్. ఇందాక ఇంటికి వచ్చివెళ్ళారట. నేను లేను. రండి లోపలికి" అంటూ ఆహ్వానించింది.

అనంత్‌తో తాను పరీక్షలు ఎంత బాగా వ్రాసింది చెప్పి మురిసిపోయింది. తరువాత లోపల్నుంచి ఒక సన్నని పొడవాటి పాకెట్ తీసుకుని వచ్చింది.

"సార్. ఇందాక షాపింగుకి వెళ్లింది దీనికోసమే. ఇది నా గురుదక్షిణ" అంటూ పాకెట్‌లోంచి మిలమిలమెరిసే ఎలక్ట్రానిక్ వాచ్ బయటకు తీసింది.

"మేరీ ఏమిటిదంతా" అంటున్నా వినకుండా అనంత్ చేతిని తన చేతిలోకి తీసుకుని, అనంత్ చేతికున్న పాతవాచీ తీసి పాకెట్‌లో పెట్టి, కొత్త వాచీ అతని ముంజేతికి తగిలించింది.

అద్భుతంగా వుంది వాచీ. కనీసం మూడువేల రూపాయల ఖరీదు వుంటుంది. తరువాత తమ్ముడిచేత కూల్‌డ్రింక్స్ తెప్పించింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ త్రాగారు.

మేరీకి తను ఆ రాత్రికే ఊరెల్తున్నట్లు చెప్పి ఆమె దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు. ఆమె, అనంత్ పాత వాచీ ఉన్న పాకెట్ అందిస్తే, దాన్ని జేబులో పెట్టుకుని, జేబులో వున్న లెటరు ఆమె కందించాడు.

"మేరీ దీన్ని జాగ్రత్త చేసి రేపు ఏకాంతంలో చదువు" అన్నాడు.

"సార్, కొంపదీసి ఇది లవ్ లెటర్ కాదుకదా" కొంటెగా అని దాన్ని తన హ్యాండు బ్యాగులో భద్రపరుచుకుంది.

అనంత్ జవాబివ్వకుండా అక్కడినుంచి గదికి బయలు దేరాడు. దారిలో స్కూటర్ని పార్సిలు వ్యానులో తన ఊరికి బుక్ చేశాడు.

అతను మేడ మెట్లు ఎక్కుతుండగా పిలిచాడు రమతండ్రి.

"ఏం మాష్టారూ! రాత్రికి మీ ఊరికి వెలుతున్నావటగా. ఈ రాత్రికి ఇక్కడే భోంచేయి" అన్నాడు. అది ఆజ్ఞతో కూడిన గంభీర స్వరం. దానికి తిరుగులేదు.

"అవునండీ. అర్ధరాత్రి పన్నెండు గంటలకు బస్సెక్కితే, తెల్లవారేసరికి మా ఊళ్ళో వుంటాను" అన్నాడు అనంత్.

ఆ రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆ కుటుంబ సభ్యులతో కలిసి భోంచేశాడు అనంత్. రమ కొసరి కొసరి వడ్డించింది. తను యూనివర్శిటీ ఫస్టు తప్పకుండా వస్తానని, దానికి కారణం తన మాస్టారేనని మరీ మరీ పొగిడింది.

భోంచేసి పైకి వెళ్లిన అనంత్ వెనుకనే వచ్చింది రమ. "మాష్టారూ మన అనుబంధం ఈ రోజుతో తెగిపోయింది. ఇక నన్ను కాలేజీకి వస్తానన్నా రానివ్వరు. మన బంధం తెగినా అనుబంధం తెగకూడదని ఇదుగో దీన్ని గుర్తుగా తెచ్చాను" అంది.

"ఏమిటి?" అన్నాడు ఆశ్చర్యంగా గదిలోకి వెల్తూ.

అతన్ని విశ్రాంతిగా కూర్చోనిచ్చి, తరువాత తన చేతిలో వున్న రంగుల పెట్టె మూత ఓపెన్ చేసింది. అందులోంచి కళ్లు జిగేల్ మనిపించే ఓ గోల్డ్ చెయిన్ బయటికి తీసింది. అడుగున పులిగోరుంది.

"మీకు పరీక్షలు అయిన తరువాత ప్రెజెంట్ చేయాలని మా అమ్మా, నాన్నలను పోరుపెట్టి నెల క్రితమే కొనిపెట్టాను".

"ఇది చాలా వేస్టు కదూ రమా".

"ఇరవై గ్రాముల బంగారు చెయిన్‌తో మేము నష్టపోయేదీ లేదు, మీరు కోటీశ్వరులయ్యేది లేదు. చెప్పానుగా మాష్టారూ మన అను బంధానికి ఇది గుర్తని" అంటూ ఆ చెయిన్ తీసి తనే స్వయంగా అనంత్ మెడకి తగిలించి హుక్ పెట్టింది.

'అబ్బ ఎంత బాగుంది' అంటూ మురిసిపోయింది రమ. తరువాత అతనికి సూట్‌కేసు సర్దుకోవడంలో సాయపడింది. ఆమె వెల్తూంటే తను వ్రాసిన లవ్ లెటరు ఆమెకు అందించి, దాన్ని రహస్యంగా చదివి, జవాబు వ్రాయమన్నాడు. రమ అలాగేనని తలూపి దాన్ని జాకెట్‌లో దాచుకుని వెళ్ళింది. ఆ అర్ధరాత్రి గది వదిలి తన ఊరికి ప్రయాణమైపోయాడు అనంత్.

• • •      • • •      • • •

వారం అనుకొన్నది పది రోజులయినా జవాబు లేదు. ఈ పది రోజులూ పది యుగాల్లా గడిపాడు అనంత్. పదకొండోరోజు వచ్చిన ఆ ఏకైక ఉత్తరాన్ని సంబరంగా

అందుకుని, హడావుడిగా చించి ఆతృతగా చదివాడు.

ప్రియమైన మాస్టారుకు,

అభినందన చందనాలు!

మీ ప్రేమలేఖలు చదివాము. ఎవరికి వాళ్ళం ఉత్తేజితులమై మిగతా స్నేహితురాండ్రకు చెప్పుకోవడానికి అనందంగా బయలు దేరాము.

కాని చూడబోతే మా అందరికి ఇలాంటి ప్రేమలేఖలే అందాయి.

మాలో ఒకరైన రమను రంభగా వర్ణించి వ్రాసారు. ఆ ముఖారవిందం చూస్తేనే జన్మ తరించి పోతుందని, దేవేంద్రుని కొలువులోని బంగారు రంగుగల రంభలా మిమ్మల్ని ఊరిస్తుందని తనను పెళ్ళాడమని వ్రాసారు.

ఇకపోతే ఉమకు వ్రాసిన ప్రేమలేఖలో ఆమెను ఊర్వశిలా ఆరాధిస్తున్నానని, విహారానికి భూలోకానికి వచ్చిన ఊర్వశి మానవుడైన పురూరవుడ్ని ప్రేమించి పెళ్ళాడినట్లు తనను ప్రేమించి పెళ్ళి చేసుకోమని, నాట్యంతో మీ గుండెల్ని రంజింపచేయమని కోరారు.

మేరీకి వ్రాసిన లవ్‌లెటర్లో కఠోరనియమ నిష్టాపరుడైన విశ్వామిత్రుడి తపస్సు భంగం చేసిన మేనక సెన్సేషనల్ అందంలాంటి అందం మేరీదని, తనను ప్రేమించి తనను సంగీత మాధుర్యంలో జీవితాంతం ఓలలాడించాలని కోరారు.

మాస్టారూ! మీరు ముగ్గురిలో మూడు రకాలయిన అందాలను ప్రేమించారు. ఆ మూడు ఒకే వ్యక్తిలో వుండుంటే మీ ప్రేమ నిజంగా సఫలమయి వుండేది. ముగ్గుర్ని చేసుకోవడానికి ఇది దశరథమహారాజు కాలం కాదు. ముగ్గుర్ని మీరు చేసుకుని ముగ్గురి కోరికల్ని మీరు తీర్చలేరు. ఆర్థికపరంగానే కాదు, చట్టబద్ధంగా కూడా కాదు ఇది. ఊహల్లోనే తప్ప ఇది నిజ జీవితంలో జరగదు.

మేము ఏఒక్కరం మిమ్మల్ని చేసుకొన్నా మిగతా మీ కోరికలు గుర్తొచ్చి మేం సుఖపడలేం. అందుకే మేం ముగ్గురం మీ ప్రేమను తిరస్కరిస్తున్నాం. మమ్మల్ని మన్నించండి. క్షమించమని కోరుతూ,

మీ శిష్యురాండ్రు

రంభ, ఊర్వశి, మేనక ✸

*(ప్రియదత్త వీక్లీ, తేది 30-5-2001)*